# నిరీక్షణ కారణం

"ప్రమీల"

కథానిక

పచ్చని పైరు చేలకి దగ్గరగా చక్కని చిన్న బంగళా డాక్టర్ రాజేశ్వరిది. ఆవిడ ఆ గ్రామంలో ప్రైవేటు ప్రాక్టీసు పెట్టి దాదాపు రెండు సంవత్సరాలైంది. ఊళ్లో వాళ్ళందరికీ ఆమె చేయి చల్లని చేయి అని బాగా నమ్మకం యేర్పడటం వల్ల ఆవిడ డిస్పెన్సరీకి ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూ పోతూనే ఉంటారు. ఆ బంగళాలో ఉండేదల్లా డాక్టర్ రాజేశ్వరి, ఒక మంత్రసాని, వీళ్ళకి వంట చేసేందుకై వీళ్ళతోపాటే ఉంటూన్న ఒక వంటావిడ. డాక్టర్‌ది అసలు శ్రీకాకుళం. విశాఖపట్నంలో ఎమ్. బి. బి. ఎస్. చదివింది. తల్లిదండ్రులు బాగా డబ్బూ, దస్కం ఉన్నవాళ్ళు. కూతురు పరీక్ష పాసవటంతోనే గవర్నమెంటు ఉద్యోగం కొరకై తండ్రి అన్వేషించ సాగాడు. కాని, అది తనకు యిష్టంలేదని, పల్లెప్రజలకు ఉచిత వైద్యసహాయం చేయటమే తన ఆశయమని వాళ్ళ నాన్నను ఒప్పించి ఈ పెందుర్తిలో మకాం పెట్టింది. ఆ గ్రామంలోనే కాక చుట్టుప్రక్కల కూడా మంచిపేరు తెచ్చుకుంది.

• • •

ఆ రోజు ఎందుచేతోగాని పేషంట్లు ఎక్కువ మంది రాలేదు. బహుశః పొలం పనుల్లోకి పోయి ఉంటారు. వంటావిడ యిచ్చిన కాఫీ తాగుతూ ఏదో మెడికల్ జర్నల్ తిరగేస్తూ రాజేశ్వరి హాల్లో కూర్చుంది. ఇంతలో బంగళాముందు ఒక టాక్సీ ఆగింది. ఆ శబ్దం వినగానే డాక్టర్ తలెత్తి చూసింది. 'అరే! ఇదేమిటి!! మా నళిని కదూ!' అని అనుకుంటూ బైట వరండాలోకి వచ్చింది. నళిని టాక్సీకి డబ్బు యిచ్చేసి మందహాసంతో మెట్లెక్కి స్నేహితురాలి దగ్గరకు వచ్చింది.

"ఏమిటి దారితప్పి యిలా రాలేదు గదా!" అంది రాజేశ్వరి పాతస్నేహితురాల్ని చూస్తున్న ఆనందంతో...

'నిన్ను చూచి ఎన్నాళ్ళయిందో కదూ! ఎప్పుడూ చూద్దామనుకోవటమేగాని, ఒక్కసారి పడలేదు. మొన్న మా శ్రీవారితో సహా విశాఖపట్నం వచ్చేను. నిన్ను చూడకుండా ఎలా వెళ్తాను చెప్పు! అందుకని ఇలా రెక్కలు కట్టుకు నీ దగ్గర వాలేనన్నమాట. అంతే!" అంది నళిని, రాజేశ్వరి రెండుచేతులూ పట్టుకుని.

పాతస్నేహితులు కలుసుకుంటే కబుర్లకే కరువా? ఎడతెరిపి లేకుండా ఏమేమో మాట్లాడుకున్నారు. ఆ సాయంత్రం చల్లగాలికి పొలంగట్లవెంబడి నడుంచుకు బయలుద్దేరారు.

"అన్నట్టు రాజీ! నిన్నొక సంగతి అడగాలని ఉంది, అడగనా?" అంది నళిని.

"దానికేం భాగ్యం! అడగవోయ్ మిత్రమా!"

"ఆ! అదే, నీ పెళ్ళిసంగతి. మా యింట్లో అందరికీ పెళ్ళిళ్లు అయిపోయాయిగా- నీకు తప్ప! నీ జూనియర్ నయిన నా సంగతి...సరే! సరి. ఎంతకాలం ఈ పల్లెటూళ్ళో పడి ఉంటావ్! ఏదో నీవూ మాలాగే..." నళిని అంటూంటే డాక్టర్ ముఖం వివర్ణమైంది.

"ఇంకేం పెళ్ళి పోనిద్దూ! చేసుకోనే మనస్సుంటే ఎప్పుడో చేసుకునేదాన్ని. ఈ ఉద్యోగ ధర్మంలో దాని తలంపే నాకు రాదు. ఇలా ఉంటే నాకిదే హాయిగా ఉంది."

"దీనికి కారణం ఏమైనా భగ్న ప్రేమా ఏమిటి కథ! కోపం తెచ్చుకోకూ..." నవ్వుతూ అంది నళిని.

"అబ్బే! అలాంటిదేం లేదులే!"

"నే నమ్మను. నీలాంటి డాక్టర్లు ఎంతమంది పెళ్ళిళ్ళు చేసుకోని ప్రజాసేవ చేయటంలేదు గనక! కారణం చెప్పవూ! నామీద ఆమాత్రం నమ్మకం నీకు లేదా?" అంటూ రాజేశ్వరిని గొడవ చేయ సాగింది.

"కొంపదీసి, సంబంధమేమైనా చూసివచ్చావా? ఏంటి!...దీనికి కారణమంటూ ఏంలేదు. ఉన్నది కూడా ఒక పెద్ద కారణమని నేననుకోను. నాకు చేసుకోవలెనన్న కోర్కెలే..." రాజేశ్వరి పూర్తి చేయకముందే, "అదో! ఏదో 'ఉన్నదికూడా' అని అన్నావ్ కాబట్టి తప్పకుండా ఏదో వుంది. ఊఁ, కానీయ్! చెప్పకుంటే నిన్ను ఒదలను!" అంది నళిని.

"అరె! తలంచుకొన్నప్పుడే తాత పెళ్ళి ఏమిటి! కాస్త సావకాశంగా చెప్తాను. సరేనా!"

చీకటి పడేలోపున యిద్దరూ ఇంటికి చేరుకున్నారు. రాత్రి భోజనాలు ముగించుకు, ఆరుబయట ఈజీచైర్లలో కూర్చున్నారు. ఆరాత్రి పున్నమేమో, చంద్రుడు చల్లగా ప్రకాశిస్తున్నాడు. కథ చెప్పటానికి, వినడానికికూడా అనువైన వాతావరణం. రాజేశ్వరి ప్రారంభించింది.

* * *

"అవి నేను కాలేజీలో చేరిన తొలిరోజులు. కాలేజీకి వెళ్ళాలంటే చచ్చేటంత భయంగా ఉండేది. ఎందుకంటావేమో! కళ్ళద్దాలు పెట్టుకుంటే నాలుక్కళ్ళంటారాయె! బుర్ర దించుకుపోతే 'ఏమిటా పెళ్ళికూతురు నడక!' అంటారు. పోనీ, కాస్త ధైర్యంగా ఉన్నట్టు కనబడితే, వాళ్ళని హడలుగొట్టేదాకా ఈ మొగపిల్లలు ఊరుకోరు. 'ఏం, చదువురా, భగవంతుడా!' అని అలాగే వెళ్లేదాన్ని. కాలేజి తెరచిన చాలా రోజులకి మరో అమ్మాయి మా క్లాసులో చేరింది. ఆ అమ్మాయి మా వీధిలోనుంచే వచ్చేది. ఇద్దరం కలిసి కాలేజీకి వచ్చేవాళ్ళం. పిల్ల చూస్తే సన్నగా, చిన్నగా పాలపిట్టంత ఉండేది. కాని నేను ఆ అమ్మాయిని చూసిన క్షణంనుంచీ ఆమె ఎడల ఒక విధమైన అనురాగం నాలో ఏర్పడింది. ఆ అమ్మాయి కళ్లు చూస్తుంటే, ఆ పద్ధెనిమిదేళ్ళ జీవితంలోనే ఏవో చాల కష్టాలనుభవించినట్లు, జాలిగా కనబడేవి. ఆ అమ్మాయిని చూచినవారికి, అవిడకు ఈ అందమైన లోకం గురించి, అందులో అనుభవించవలసిన సుఖాల గురించి తెలియజేసి, ఆ ముఖంలోకి కొంచెం నవ్వు తెప్పిద్దామని ప్రయత్నిస్తారు."

"ఇదంతా నీతో ఇంటర్మీడియేట్ చదివిన మా లలిత గూర్చికదూ, నీవు చెప్తూంట!" అంది నళిని మధ్యలో.

"ఇదుగో! అమ్మాయ్! ఇలా మధ్య మధ్యలో నన్ను డిస్టర్బ్ చేస్తే కథా లేదు, గిథా లేదు."

"లేదులే! ఇదుగో చెంపలేసుకుంటున్నాం. కానీయ్!" అంది నళిని నవ్వుతూ. మళ్ళీ మొదలు పెట్టింది రాజేశ్వరి.

"అవును ఆ అమ్మాయే లలిత. మా యిద్దరికీ ఆ రెండు సంవత్సరాల్లో చెప్పలేనంత స్నేహం పెంపొందింది. ఆడుతూ పాడుతూన్నట్లుగా కాలం గడిపేవాళ్ళం. మళ్ళీ యీ సంగతి ఎవరి దగ్గరా అనక సుమీ! బుగ్గలమీద వేళ్ళు నొక్కుకుంటారు! మా యిద్దరి మధ్యా రహస్య మంటూ ఉండేదికాదు.

ఒకసారి నేను వాళ్ళింటి కెళ్ళాను. కాస్సేపయిన తర్వాతఏమనుకుందో ఏమో, యిలా అంది:

"రాజీ! ఇవాళ నీకు నా కథ చెబుదామనుంది. నేను తల్లిదండ్రులు లేనిదాన్నని నీకు తెలుసనుకుంటా. కానీ, విపులంగా ఏమీ తెలియదు కదూ!"

"అవును. లల్లీ! ఎప్పుడైనా అడుగుదామని నాలిక చివరిదాకా చాల సార్లు వచ్చింది. కాని, అవన్ని జ్ఞాపకం చేసి నీ మనస్సు నొప్పించటం యిష్టంలేక ఊరుకొన్నా. నిజంగా వినాలని నాకు చాల కుతూహలంగా ఉంది" అని అన్నాను.

"మా నాన్న రంగూన్‌లో వ్యాపారం చేస్తుండేవారు. నేను, అమ్మ మద్రాస్‌లో ఉండేవాళ్ళం. నాన్న అప్పుడప్పుడు వచ్చి, చూచి వెళ్తూండేవారు. వ్యాపారంలో బాగానే సంపాదించారు. ఇంతలో యుద్ధం హడావిడి ఎక్కువయింది. రంగూన్ నుండి నడచి మన దేశం చేరినవారిలో మా నాన్న ఒకరు. ఇక్కడకు చేరేసరికి ఆయన మనిషిలా లేరు. చాల జబ్బుచేసింది. సంవత్సరం వరకూ ఆ జబ్బు మా నాన్నను పీడించి చివరకు

ఆయన ప్రాణం తీసింది. మా అమ్మ నాన్నకు సేవ చేయటంలో నిద్రాహారాలు మర్చేపోయింది. దానికి తోడు ఈ దుఃఖం. దానితో ఆవిడ కూడా మంచమెక్కి రెండు నెలలయింతర్వాత, నన్నీ లోకంలో అనాథగా బ్రతకమని వదలి వెళ్ళిపోయింది. మా ఆస్తి యీ లోగా చాలవరకు హారతి కర్పూరంలా హరించిపోయింది. ఇక నా సంగతి మా వాళ్ళకి పెద్ద సమస్య అయి ఊరుకుంది. చివరకు మా మేనత్త నన్ను వాళ్ళింటికి తీసుకు వెళ్ళారు. అప్పటినుండి వాళ్ళదగ్గరే ఉంటున్నా. మా అత్తకి యిద్దరు కొడుకులు, ఒక కూతురు. ఒదినకు, పెద్ద బావకు పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇప్పుడు మా చిన్న బావ ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని ప్రోద్బలం వల్లే నేను చదువుతున్నానన్నమాట."

"ఉహుఁ, అయితే ఫర్వాలేదు."

"ఏమిటి ఫర్వాలేదు?"

"అహఁ! ఇంక నీకు వరాన్వేషణ అనవసరమంటున్నా" అన్నాను నవ్వుతూ.

"పోదూ! నీ వేళాకోళం, నువ్వూను!" అంది బుంగమూతిపెట్టి లలిత.

"అది సరేగాని, మీ బావ ఎలా ఉంటాడో చెప్పవూ?"

"ఆ! గొప్ప అందగాడేమీ కాదులే! మా ఇద్దరికీ వయస్సులో కాస్త భేదముంది. ఎంతో కాదులే పదిసంవత్సరాలే" అంది నవ్వుతూ. "కాస్త లావుగా కూడా ఉంటాడోయ్!" అంది మళ్ళీ.

"అయితే, లంబోదర..."

"అబ్బబ్బ! చంపుతావ్! అందుకే నీకు ఏం చెప్పను. ఫో!" అంది లలిత.

కాని నేను కాస్త బ్రతిమిలాడగానే మెత్తబడి మళ్ళీ మొదలు పెట్టింది.

"ఒక నెల్లాళ్ళక్రితం, అంటే మొన్న దసరా సెలవుల్లో, మా బావ ఢిల్లీనుండి వచ్చాడు. నేను 'మా రాజీకి కబురుచేస్తే బాగుండునే' అని అనుకుంటూ వుంటే,

"పోనీ, పేపర్లో ఎడ్వర్టైజ్ చేయించు. లేకుంటే దండోరా వేయించవే మరదలుపిల్లా!" అని ఎగతాళి చేయడం మొదలుపెట్టాడు మా బావ. అందుకని ఊరుకున్నా. ఇవాళ ఢిల్లీనుండి ఉత్తరం వచ్చింది. నీ గురించి వ్రాశానులే! అందుకని నీకు శుభకాంక్షలు పంపాడు." "అన్నట్టు, అది సరేలే! కాని, వారి నామధేయం బెద్ది చెలియా?...సిగ్గుపడకే తల్లీ! అప్పుడే సిగ్గుల పెళ్లికూతురు వవుతున్నావా? ఇప్పుడే వద్దులే!" అన్నాను, నవ్వాపుకుంటూ. "శే...ఖ...ర్" అంది లలిత కిలకిల నవ్వుతూ. హాలంతా మా నవ్వులతో మారుమ్రోగింది.

ఇలాగే ఆ రెండు సంవత్సరాలు రెండు రోజులుగా హాయిగా గడిచిపోయాయి. పరీక్షలయిపోయాయి. ఇద్దరం, ఎవరిండ్లకు వాళ్లు వెళ్ళిపోయే సమయం వచ్చేసరికి, ఒకళ్ళనొకళ్ళం కౌగిలించుకు, ఏడ్చుకున్నాం. ఉత్తరాలు వ్రాసుకుందామని మాట తీసుకొని యిద్దరం విడిపోయాము. తర్వాత రిజల్ట్సు వచ్చాయి. మేమిద్దరం పాస్ అయ్యాం. కాని లలితని వాళ్ళవాళ్లు పైకి చదివించనన్నారుట. పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఉత్తరాల్లో వ్రాస్తూ ఉండేది. నాకు యింటర్లో క్లాసు రావటం మూలాన్న ఎమ్. బి., లో సీటు దొరికింది. ఒక రోజు నేను కాలేజినుండి ఇంటికొచ్చేసరికి నాబల్ల మీద ఒక కవరుంది. దస్తూరినిబట్టి లలితే వ్రాసిందనుకున్నాను. ఆత్రంగా విప్పాను.

నారాజీ!

నీవు వ్రాసిన ఉత్తరం అందేసరికి నేను మా తోటలో మొక్కలకి నీళ్లుపోస్తున్నా. మా అత్త నీ ఉత్తరం తెచ్చి నాకిచ్చింది. నిజం చెప్పొద్దూ! ముందు, ఢిల్లీనుండి వచ్చిందేమో అనుకున్నాను. కాని, అంతకన్నా ప్రియమైనవారివద్దనుండి అది రావటం చూచి పొంగిపోయాననుకో! కోతలు కోస్తున్నాననుకోకూ... అన్నట్టు, ఒక ముఖ్య సంగతి. మా ఇంట్లో యిప్పుడు చాలహడావిడిగా వుంది. వెల్లలు వేయించడం, అదీ, ఇదీ! నీవు తప్పక వస్తావుగా! దేనికని అడుగుతున్నావా? మా బావ పెళ్ళి నిశ్చయమైంది. మే 11 న పెండ్లి. మాబావ తరఫున నిన్ను స్వయంగా నేను ఆహ్వానిస్తున్నాను. మరి తప్పక రావాలి సుమా! ఎంత ముందుగావస్తే అంత సంతోషిస్తా. మరి సెలవ్!

ఇట్లు నీ లల్లి.

"ఆ ఉత్తరం చూడు! ఎంత గమ్మత్తుగా వ్రాసిందో! వాళ్ల బావ పెళ్ళిట... పెంకి ఘటం.

కొద్దిరోజులకే శుభలేఖకూడా వచ్చింది. దానిలో 'చి. సౌ.' లలితాదేవిని"—అన్నది చూడగానే నా కదోవిధమైన ఆనందం కల్గింది.

ఇంకా పెండ్లి రెండు రోజులున్నదనగానే, నేను లలిత వాళ్ళఊరు, తుని, బయలుదేరాను. నన్ను స్టేషన్‌లో కలుసుకుందుకని వాళ్ళ పెద బావగారు, ఆయన భార్య వచ్చారు. ఎంతో ఆదరంతో ఇంటికి తీసికొనివెళ్ళారు. మా లల్లి ముఖంలో పెళ్ళికళ ఉట్టిపడుతూంది. శరీరం అంతా పసుపు పూతలవల్ల కాబోలు, చక్కగా మెరుస్తూంది. అన్నిటికన్నా ముఖ్యం — ఆ నుదురుపైనున్న కళ్యాణం బొట్టు లలిత ముఖానికి ఒక వింత శోభ కూర్చింది. ఇద్దరం ఒకరినొకరు చూచుకొని చాలరోజులు కావటంచేత యిక మా మాటల కంతు కన్పించలేదు.

ఆ మర్నాడు పెండ్లికొడుకు ఢిల్లీనుండి వస్తున్నాడు. అందుకని స్టేషన్‌కి అంతా బయలుదేరారు. నన్ను కూడా రమ్మన్నారు. నాకు కూడా చూడాలని చాలా కుతూహలంగానే ఉంది. ఎందుకంటే లలిత వర్ణించిన విధంగా, నేను అతన్ని కాస్త వయస్సులో పెద్దవాడిలాగా,లావుగా చిన్న యేనుగుపిల్లలాగుంటాడని ఊహించుకున్నా (కాని అలాఅని మా లల్లితో అంటే నా ప్రాణాలు తోడేయదూ.)

స్టేషన్‌లో పేరంటాళ్ళు పెద్ద పూలదండ, పన్నీరు, హారతి మొదలగు సరంజామాతో హాజరుగా నిలబడ్డారు. నేనూ వాళ్ళప్రక్కనే నిలబడ్డా. ఇంతలో రైలు వచ్చింది. సెకెండ్ క్లాసు కంపార్ట్మెంట్‌లో ఉన్నాడని వాళ్ళు అనుకుంటూంటే విన్నాను. ఆ పెట్టె మాకు చాలదూరంలో వెళ్ళి ఆగింది. అక్కడికి అంతా పరుగులు తీశాము. ఆడవాళ్ళ చేతుల్లో ఉన్నవన్నీ చూచాడుగాబోలు, పెట్టె వతలకు రాడే! మహానుభావుడు ఎప్పుడు వస్తాడా, ఎప్పుడు చూద్దామా, అని నేనుంటి. ఎలాగై తేనేం! ఆయన బయటకు వచ్చాడు. రావటమేమిటి, ఈ పేరంటాళ్లు వాళ్ళు తెచ్చినవన్నీ ఆయనమీద ప్రయోగించిడమేమిటి, క్షణంలో జరిగాయి. కాని పూలదండ వేసివేయగానే, తీసేస్తూ "ఇదేమిటి! నన్ను పగటి వేషగాడిలా తయారు చేస్తున్నారు!" అన్నాడు శేఖర్ నవ్వుతూ. అతన్ని చూడగానే నాకు చాలా ఆశ్చర్యమేసింది. నా లెక్కనిబట్టి అతనికి ముప్పై ఉండాలి. కాని మనిషి పాతిక సంవత్సరాలవాడిగా ఉన్నాడు. లలిత లావుగా ఉండాడంటే నేను ఒక చిన్న యేనుగు పిల్లలా లెక్కవేశాను. కాని మనిషి చక్కగా పొడుక్కి తగ్గ లావుగా ఉంటాడు. సరే! టాక్సీలో మేమంతా ఇంటికి బయలుదేరాం. దారిలో లలితవాళ్ళ పెదబావగారు నన్ను చూపించి,

"శేఖర్, ఈవిడ మన లలిత ఫ్రెండ్ మిస్ రాజేశ్వరీదేవి. ఇప్పుడు సెకండ్ ఇయర్ ఎమ్. బి. చదువుతున్నారు" అని అన్నారు.

"ఓహో! ఈవిడేనా!" అని నాకు నమస్కారం చేశాడు. ఆయన అన్న ఆ రెండు ముక్కలు బట్టి నాగురించి మా అనుంగు నెచ్చెలి చాలా వ్రాసి ఉంటుందని ఊహించాను.

నేను చదువుకొనే రోజుల్లో నాకు రాబోయే వరుడు ఎలాగుంటే బాగుంటుందా! అని ఆలోచించుకునేదాన్ని. నా ఊహాలకి శేఖర్ చాలా సన్నిహితంగా కనబడ్డాడు. అతన్ని చూచిన క్షణం నుంచీ మనస్సులో ఏమో తెలియని ఆవేదన! కాని మళ్లా ఆయన నా ప్రాణ స్నేహితురాలికి కాబోయే భర్త అని జ్ఞాపకం రాగానే, 'నే నలా తలంచకూడద'ని సరిపెట్టుకొనేదాన్ని.

ఆ సాయంత్రం లలితవాళ్ళ అత్తగారు నన్ను టిఫెన్ తీసికొని వెళ్ళి శేఖర్‌కి యిచ్చి రమ్మన్నారు. ఎందుకంటే పెళ్ళికూతురుండే ఛాయలకు ఆయన రావటానికి వీలులేదన్న మాట. నేను టిఫెన్, కాఫీ తీసుకెళ్ళాను.

"అరె! ఇదేమిటి రాజీగారూ! మీరు తెచ్చారా? రండి, రండి, కూర్చోండి" అని శేఖర్ ఆహ్వానించాడు. నేనేమీ మాట్లాడకుండా కూర్చున్నాను.

"మీరు టిఫెన్ తీసుకున్నారా?—అన్నట్టు మీరు చాల బాగాపాడతారని మీ లల్లి నాకు వ్రాసింది. ఎంకిపాటలు చక్కగా పాడతారటగా! ఒక్కటి పాడండి. ప్లీజ్!"

"అబ్బే! నాకేంరావండి. గోరంతలు కొండంతలు చేయటం మీకాబోయే అర్ధాంగికి అలవాటు" అన్నాను చిన్నగా నవ్వుతూ. ఆయన

చాలా సోషల్‌గా మాట్లాడుతారని నేనప్పుడు గ్రహించాను. అయినా ఢిల్లీ నివాసికదా—!

పెండ్లి చాలా వైభవంగా జరిగింది. శేఖర్ గారికి వాళ్ళ స్నేహితులు చెప్పలేనన్ని శుభాకాంక్షలు టెలిగ్రామ్‌లద్వారా పంపించారు. ఆ మర్నాడు నేను ప్రయాణం కట్టాను. ఉండమని లలిత చాలా బలవంతపెట్టింది. కాని నేను కాలేజీ ఎన్నిరోజులు ఎగవేస్తాను? అయినా యింక జరగబోయే కార్యక్రమంలో నాకుండటం సిగ్గనిపించి బయలుదేరాను. పెండ్లికొడుకు స్టేషనుకు వచ్చాడు. రైలు కదలబోతుండగా నేను చెయ్యెత్తి నమస్కారం చేస్తూంటే, "మీరు తప్పక ఢిల్లీ ఒకసారి రండి. చూడవలసినవన్నీ చూపిస్తాం. తప్పక రావాలిసుమా! మీలల్లి.." చివరి మాటలు నాకు సరిగా వినిపించలేదు. నేను వైజాగ్ వచ్చేశాను.

పెళ్ళయిన వారంరోజులకి గాబోలు, శేఖర్, లలితలు ఢిల్లీ వెళ్ళారు. వాళ్ళతో పాటు శేఖర్ తల్లికూడా వెళ్ళి నెలరోజులుండి తిరిగి వచ్చేసిందట. లలిత ఢిల్లీ చేరగానే నాకు పెద్ద ఉత్తరం వ్రాసింది. ఢిల్లీలో వాళ్ళ కొత్త సంసారం, అంటే ఇల్లుగురించి, వాళ్లు కొంటూన్న సామగ్రిని గూర్చి, ఒకటేమిటి?... వాళ్ళ బావ తన్నెంతో ప్రేమగా చూస్తున్నాడట. ఇలాగే ఎన్నో సంగతులు—

వాళ్ళ పెండ్లయి అది రెండో సంవత్సరం. నేను ఫోర్తు ఇయర్‌లో ఉన్నాను. మా ఇద్దరి మధ్య ఉత్తరాలు యథావిధిగానే జరుగుతున్నాయి. కాని ఒక సంగతి మాత్రం లలిత నాకు వ్రాయటానికి సిగ్గుపడ్డట్టుంది. ఆవిడగారు తల్లి కాబోతూన్నట్టు ఒకరు చెప్పగా విని చాలా ఆనందించాను. లలితను చూడాలనే కోరిక రోజురోజుకీ మరీ ఎక్కువ కాజొచ్చింది. లలితకూడా ప్రతి ఉత్తరంలోనూ నన్ను రమ్మని వ్రాస్తూనే ఉండేది. మాకా సెలవులంటూ వేరే వుండవు. సరే! ఎలాగయినా వెళ్ళాలనుకొని ఒక పదిరోజులు సెలవుపెట్టి ఢిల్లీ బయలుదేరాను. బయలు దేరినట్టు వాళ్ళకి టెలిగ్రామ్ ఇచ్చాను. అదృష్టవశాత్తూ కలకత్తాలో ఏదో పనుండి మా మామయ్యా బయలుదేరుతుంటే ఆయనతో కలసి నేనూ బయలుదేరాను. కలకత్తానుండి ఒక బెంగాలీ ఆవిడ ఢిల్లీకి వెళ్తూంది. ఆవిడక్కూడా నేనున్న కంపార్ట్మెంటులోనే బెర్త్ రిజర్వ్ చేశారు కాబోలు సరాసరి నాపెట్టి ఎక్కింది. ఆవిడ నాకు తోడుగా ఉండటం ఒక అదృష్టమనుకున్నాను. ఎంతైనా అటు వైపు ప్రయాణం క్రొత్తగదా!

ఢిల్లీ స్టేషన్‌లోకి రైలు వెళుతూంది. రాత్రి తొమ్మిదిగంటలవుతుంది. నాకేమో కాస్త భయంగానే ఉంది. ఎందుకంటారా, ఒకవేళ వీళ్లు స్టేషనుకు రాకపోతే నేనొక్కర్తిని యీ మహాపట్నంలో వాళ్ళయిల్లు చేరగలనా, అని. నేను గుమ్మంలో నిలబడి ప్లాట్‌ఫారమ్‌మీదకు చూస్తున్నాను. 'హమ్మయ్య! అదుగో లల్లి, శేఖర్ అక్కడ నిలబడ్డారు.' నన్ను చూచి నా కంపార్ట్మెంటు దగ్గరకు వచ్చారు. నేను క్షణంలో దిగి మా లలితను తనివితీరా కౌగలించుకొన్నాను. లలితలో కలుగుతున్న శారీరక మార్పులు ఒక క్రొత్త అందాన్ని ఆమెకు తెచ్చిపెట్టాయి. సిగచుట్టుకొని పూలు పెట్టుకొంది. నా కళ్ళకి చాలా అందంగా కన్పించింది. టాక్సీలో వాళ్ళ యింటికి చేరాం. చిన్న యిల్లే అయినా అన్ని సదుపాయాలూ ఉన్నయ్. లలిత యింటిని చక్కగా, పొందికగా అమర్చుకొంది. ఆ రాత్రంతా మేమిద్దరం ఒకటే మాటలు! ఆ బాతాఖానీకి అంతూ, దరీ కనబడలేదుగాబోలు, శేఖర్ ఇలా అన్నాడు. "ఏమండోయ్! రాజీగారూ! మీ మాటలకి తుది అంటూ లేదా? నన్ను రేపు ఆఫీసులో నిద్రపొమ్మన్నారా మీ స్నేహితులిద్దరూ కలసి!" అన్నాడు నవ్వుతూ.

* * * *

మా లలిత ఇంతకు ముందు వాగినంత వాగటం లేదు. ఆ చలాకీతనంకూడా లేదు. కాస్త ముభావంగా ఉన్నట్టు నేను గ్రహించాను. దానికి కారణం నాకాసమయంలో స్ఫురించలేదు. 'నన్ను రమ్మని మాటవరసకి వ్రాసిందేమో! కాని నేను రావటం అంతగా యిష్టంలేదనుకుంటా' అని అనుకున్నాను. కాని, దానికి కారణం తర్వాత అర్థమయింది. మా లల్లి పరిస్థితిలోనున్న ప్రతి స్త్రీకి కొన్ని ఇష్టాలు, అనిష్టాలు ఏర్పడటం సహజంకదా! తనకు ఎవరితోనైనా మాట్లాడడమంటే చిరాకుగా ఉండేదట. ఆఖరికి శేఖర్‌తోకూడా అంత ఎక్కువగా మాట్లాడేదికాదు. ఈ సంగతి నేనిక్కడ ఉన్నప్పుడే చెబితే బాగుండునా? నేను ఢిల్లీనుండి తిరిగి

వచ్చేసింతర్వాత, తన ప్రవర్తనకి క్షమాపణ కోరుతూ అసలు సంగతి వ్రాసింది. సరే! దాన్నలా వదిలిపెట్టు.

లలితయొక్క యీ ప్రవర్తనవల్ల, నన్ను ఎంగేజ్ చేయటం శేఖర్ వంతుఅయింది. నేను ముందు నీకు చెప్పిన కారణంవల్ల సాధ్యమయినంత వరకూ ఆయన్ని తప్పించుకు తిరుగుదామనుకున్నా. లల్లి లేకుండా ఆయన దగ్గర మసలకూడదనుకున్నాను. ఎంతైనా మానవ దౌర్బల్యంగదా!

ప్రతి సాయంత్రం ఆయన ఆఫీసునుండిరాగానే, మేమంతా కలసి ఊరు చూడ్డానికి బయలుదేరే వాళ్ళం. అప్పుడుకూడా లల్లి ఎక్కువ మాట్లాడేది కాదు. మొదటి రెండు రోజులు, రాజ్ ఘాట్, లాల్ ఖిల్లా చూడ్డానికి లల్లి వచ్చింది. కాని తరువాత తాను రాలేనంది. నన్ను తీసికెళ్ళమని శేఖర్‌తో చెప్తుంటే నేను విన్నాను. శేఖర్ నాకు చాలా ప్రదేశాలు చూపించారు. బిర్లామందిర్‌లో ఉన్న తోటల్లో కాస్సేపు కూర్చుని మాట్లాడటం నాకిప్పటికి జ్ఞాపకముంది. ఆయన చాలా చక్కగా మనసిచ్చి మాట్లాడేవారు. నాకది అమృత ప్రాయంగా ఉండేది. నేను మొదట్లో అంత చనువుగా మాట్లాడకపోయినా, రానురాను పరిస్థితులను బట్టి వద్దనుకుంటూనే చనువుగా ప్రవర్తించసాగాను. మా కాలేజి సంగతులు, ఆయన ఆఫీసు సంగతులు ఒకటేమిటి...అన్నీ మాట్లాడుకునేవాళ్ళం. ఇలా రోజూ తిరగటం మూలాన్న శేఖర్‌ని చాలా సన్నిహితుడైనట్టు భావించసాగాను. కాని మళ్ళా నేనేమైన తప్పు చేస్తున్నానేమో అని మనస్సు పీకుతూ ఉండేది.

ఒక సాయంత్రం నన్ను 'చాందినీ చౌక్'కు తీసికొని వెళ్ళారు. అక్కడ నేను ఏవో కొన్ని బట్టలు, చిన్న-చిన్న ఫాన్సీ వస్తువులుకొని, యింటికొచ్చాము. లలిత వంటింట్లో ఏదో వంట అతనికి చెబుతూ పనులు పురమాయిస్తోంది. నేను వెళ్ళి, "షాపింగ్ చేసుకొచ్చాను, లల్లీ!" అన్నాను. "ఓహో!" అని ఊరుకుంది. అంతే! పోనీ, ఏమిటి కొన్నావ్' అని గాని, చూపించు చూస్తానని గాని అనలేదు. నిజంగా అప్పుడు నా మనస్సు చివుక్కు మంది. 'ఛీ! ఎందుకొచ్చానా యిక్కడికి' అనిపించింది. లలితమీద కోపమొచ్చిందని వేరే చెప్పనక్కరలేదుగా!

ఆరాత్రి పడుకున్నాము. నిద్ర రావటంలేదు. కళ్ళు మూసినా, తెరచినా శేఖరే నాముందు మసలుతూన్నట్లనిపించేది. లలితమీద కోపం, శేఖర్ మీద అనురాగంగా మారిందేమోనని యిప్పుడనిపిస్తూంటుంది. ఆయన సాంగత్యం నన్ను పిచ్చిదాన్ని చేసింది. ఎంతైనా నేనూ ఒక ఆడదాన్నే! నాలో కోర్కెలు రేగటం సహజం. కాని నాలో ఏదో ద్వంద్వయుద్ధం ప్రారంభమయిందనే చెపాలి.

• • •

లలితకి మొగపిల్లవాడు. ఎంత చక్కగున్నాడు. అంతా వాళ్ళ నాన్న పోలికే! కాని...లలిత సంగతేమీ బాగులేదు. ఇంకా హాస్పిటల్‌లోనే ఉంది. కాని ఆఖరికి ఎక్లాంప్సియావచ్చి పిల్లవాడిని శేఖర్‌కు అప్పగించి శాశ్వతంగా కన్నుమూసింది. నేను పిల్లవాడిని సొంత తల్లిలాగా ఎక్కువ ఆదరంతో పెంచటం చూచి, వాళ్ళ వాళ్ళు నన్ను శేఖర్‌కు ద్వితీయ కళత్రాన్నిగా చేశారు. పెండ్లయినరాత్రి శేఖర్ నన్ను దగ్గరకు తీసికొంటూంటే చెప్పరాని ఆనందం! కాని సిగ్గువల్ల ప్రక్కకి తప్పుకున్నాను.

• • •

మంచం మీదనుండి క్రిందకు పడబోయే సమయంలో మెళకువ వచ్చింది. 'అయితే! ఇదంతా కలన్నమాట!' నా ప్రక్కనే మరొక మంచంమీద లల్లి ప్రశాంతంగా నిద్రపోతూంది. ఆ ముఖం చూడగానే నాకాపట్టరాని దుఃఖం వచ్చింది. అయ్యో! నా ప్రాణసమానంగా చూచుకున్న నా లల్లిమీదనా, నా కీకల! బహుశా నాకు తెలియకుండా నాలో యిలాంటి ఊహ జనించి ఉండవచ్చు. అదే యీ కల రూపంలో ఇలా వచ్చింది. నేనెంత నీచురాల్ని. "భగవంతుడా! నన్ను క్షమించు. మా లల్లిని సురక్షితంగా పది కాలాల పాటు భర్తతో, బిడ్డలతో సుఖించేటట్లు చెయ్యి. నా యీ పాడు ఆలోచనలు కార్యరూపం దాల్చకుండా చూడు" అని పదే పదే దేవునికి మొర పెట్టుకున్నాను.

ఇక నాకు అక్కడ ఒక్క క్షణం ఉండ బుద్ధి పుట్టలేదు. వెంటనే వైజాగ్ బయలుదేరి వచ్చేశాను. తర్వాత లలితకు ఆడపిల్ల పుట్టినట్లు నాకు

వైర్ ఇచ్చారు. నేను తుని వెళ్ళి తల్లీ, బిడ్డను చూచి తిరిగి వచ్చాను. తర్వాత లలిత బిడ్డతో ఢిల్లీ వెళ్ళిపోయింది. అక్కడనుండి నాకు తన కూతురు గూర్చి ఏమేమో వ్రాసేది. ఇలా ఒక సంవత్సరం గడచింది. నేను ఫైనల్ ఇయర్‌లో ఉండగా లలితకు మరొక బిడ్డ కల్గింది. కాని నే నేదైతే జరగకూడదనుకున్నానో, ఏదైతే కార్యరూపం దాల్చకుండా చేయమని భగవంతుని వేడుకున్నానో, అదే జరిగింది. భగవంతుడు నా ప్రార్థన ఆలకించలేదు.

పురిటిలో లలితకు చాలాకష్టమయింది- చిన్న ప్రాణానికి హానిలేకుండా చేయగలిగారు, కాని పెద్ద ప్రాణాన్ని రక్షించలేకపోయారు. లలిత పిల్లల్ని తల్లిలేని వాళ్ళగాచేసి, పసుపుకుంకుమతో సంతోషంగా వెళ్ళిపోయింది...

"అయ్యో! మీ లలిత పోయిందా? నా కాసంగతి తెలియనే తెలియదు, పాపం!" అంది నళిని విచారంగా.

"అవును. అంతా అయిపోయింది. లలిత చావుకి నేనేకారణమని, అదేమిటో నామనస్సులో ఎప్పుడూ బాధగా ఉంటుంది. శేఖర్ మళ్ళా పెళ్ళి చేసికోలేదు. వాళ్ళ అమ్మను తెప్పించుకు పిల్లలతో ఢిల్లీలోనే ఉన్నాడు. చంటివాడు అచ్చు లలిత పోలికే! ఇది జరిగిన తర్వాత నేను శేఖర్‌ని చూడలేదు. కాని, పిల్లలు వాళ్ళ తాతగారింటికి వచ్చినప్పుడు తప్పక వెళ్ళి చూచివస్తూంటాను.

"మనందరికి కలలు నిజమవుతాయా అన్న సందేహం ఉంటుంది కదూ! కాని నా కల అక్షరాలా నిజమని నిరూపించుకుంది. మొన్న పిల్లల్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు లలిత వాళ్ళ పెదబావ గారు శేఖర్ పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. నేను పిల్లల్ని ప్రేమతో చూస్తున్నానట! అందుకని నన్ను వాళ్ళకి తల్లిలేనిలోటు తీర్చమన్నారు- శేఖర్ కూడా యిందుకు ఇష్టపడ్డట్టు చెప్పారు. ఆయన అలా అంటూంటే ఎంత ఆపుకుందామన్నా ఆగక, నాకు దుఃఖం పెల్లుబికింది. దానితో ఆయన మరేమీ మాట్లాడలేదు. నాకు యిష్టంలేదని ఆయన గ్రహించారు. తర్వాత నేను తిరిగి వచ్చేసాను.

'ఇదీ, జరిగిన కథ. ఆ పెళ్ళేగనక జరిగితే ఎందుకో, నాకివన్నీ తెరమీద కనబడినట్లు ఒక దాని తర్వాత ఒకటి జ్ఞాపకం వస్తాయి. నేను ఆజన్మాంతం ఇలాగే కన్యగా యీకృషిలో లీనమై పోయి ఉండిపోదామని తీర్మానించుకున్నాను. పిచ్చిగా ఉంది కదూ! నా కథ" అని ముగించింది రాజేశ్వరి.

నళిని జవాబియ్యలేదు. బహుశా నిద్రపోతూందేమోనని రాజేశ్వరి,

"ఏయ్! నళినీ! నిద్రపోతున్నావా? లే, లే!" అంది

"నిద్ర ఎలా వస్తుందే, వెర్రిదానా! నీ హృదయంలో యింత విషాదం పెట్టుకొని పెండ్లి చేసికోక పోవటానికి తగిన కారణం లేదంటావేం!" అంది నళిని.

"ఆ! దాన్ని గూర్చి సాధ్యమయినంత వరకు మరచిపోయి, నా ఉద్యోగ ధర్మంలో లీనమవటానికి ప్రయత్నిస్తున్నా. పద, లోనికి పోదాం! చాలా ప్రొద్దుపోయింది" అని లేచింది డాక్టర్ రాజేశ్వరి.

ఇద్దరూ బరువైన హృదయాలతో బంగళా వైపు నడిచారు.

---

ఈ యంత్రయుగపు ఆధునిక నాగరికతలో స్త్రీకి అనువైన వివాహ సమయం ఏది అనే ప్రశ్న తరుచు వినవస్తున్నది. ఒంటరిగా ఉన్నప్పటికీ సంతృప్తికరంగా, స్వయంవ్యక్తిత్వంతో సుఖంగా జీవించడం నేర్చుకున్నప్పుడుగాని ఆధునిక యువతి వివాహానికి అర్హురాలు కాదని నా విశ్వాసం. ఒంటరి జీవితం దుర్భరం అనిపిస్తే, దానికి పరిష్కారం వివాహం కాదు; ఉద్వేగాలను అణుచుకోలేకా, శారీరక వాంఛలు చంపుకోలేకా—ఆ కారణంగా వివాహమాడడం మరింత అసంతృప్తికి దారితీస్తుంది. లేని సుఖాన్ని పొందడంకోసం కాదు వివాహం: ఉన్న సుఖాన్ని ఎక్కువచేసుకోవడంకోసం. ఈ రెండింటికీ చాలా తేడా ఉంది.—(జార్జి లాటన్.)